క్లుప్తంగా

సేంద్రియమే శ్రేయస్కరం



మామిడికుదురులో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏఓ మృదుల

మామిడికుదురు: ప్రస్తుత జీవన విధానంలో ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరమని మండల వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులతో పండించిన ఉత్పత్తుల విక్రయం స్టాల్‌ను ఆమె సోమవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల వల్ల మానవుల ఆరోగ్యంపై ఏ విధమైన దుష్పరిణామాలు ఏర్పడవని చెప్పారు. ఈ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఎక్కువ మంది రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. సేంద్రియ వ్యవసాయం సాగు ఇంకా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దీనిపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ, కుడుపూడి పద్మావతి, గోగి లెనిన్ పాల్గొన్నారు.

గ్రామస్తులకు మాత్రమే తాగునీరు అందించాలి

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం మంచి నీటి చెరువు నుంచి గ్రామస్తులకు మాత్రమే తాగు నీరు అందించాలని కోరుతూ మాజీ సర్పంచ్ సర్రెళ్ల విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం ఎంపీడీవో కే సూర్యనారాయణకు అర్జీ అందజేశారు. చెరువు నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా వేరే ఏరియాలకు తరలిపోతున్న మంచినీటికి అడ్డుకట్ట వేయాలని కూడా ఆ అర్జీలో వారు కోరారు. బోణం రాజు, బళ్ల చరణ్, దీపాటి రాకేష్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

అంబాజీపేట: హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న నిర్వహించే విజయోత్సవ భారీ బైక్ ర్యాలీని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అమలాపురం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రముఖులు పిలుపునిచ్చారు. గంగలకుర్రు అగ్రహారంలో హనుమాన్ జన్మదినోత్సవ పాంప్లేట్లను శ్రీ హనుమాన్ శోభా యాత్ర కమిటీ సభ్యులు స్థానికులకు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజ్ రోడ్డులో ఉన్న త్రిముఖ గణపతి ఆలయ పక్కన ఖాళీ స్థలంలో సభ నిర్వహించనున్నామన్నారు. ఈ సభకు మారుతీ జీయర్ దాస్ స్వామీజీ, రాళ్ళపల్లి పాపయ్య శర్మలు పాల్గొనున్నారన్నారు. హిందువులంతా ఈ భారీ బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో ప్రమాదం

మామిడికుదురు: సికిల్‌సెల్ ఎనీమియాతో ప్రమాదం పొంచి ఉందని దానిపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. పాశర్లపూడిలంకలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇది వంశపారంపర్యంగా వస్తుందన్నారు. దీనిని ఏమాత్రం అజాగ్రత్త చేయొద్దని సూచించారు. దీనిలో భాగంగా పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేశారు. బి.దొడ్డవరం గ్రామ పంచాయతీలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించారు.

ఘనంగా బంగారమ్మ తల్లి తీర్థం

కొత్తపేట: స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు సోమవారం నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి వెళ్లిన సోమవారం అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి పౌర్ణమి-సోమవారం సందర్భంగా తీర్థం జరిపారు. ఉదయం అమ్మవారికి ఆలయ ఆసాదులు ప్రత్యేక పూజలు, కుంభాభిషేకం జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. స్థానిక ఎస్సై ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు.

కోఆర్డినేటర్ పరామర్శ



నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో ఇటీవల మృతి చెందిన యడ్ల నాగరాజు కుటుంబ సభ్యులను సోమవారం పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. నాగరాజు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రావులపాలెం: రిటైర్డ్ తహసీల్దార్ కొప్పిశెట్టి దుర్గారావు కుమారుడు శశికాంత్ జ్ఞాపకార్థం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. కుమారుడి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఆర్‌ఐ సుజాత, ఉన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వేసవిలో విద్యుత్ సమస్యలకు అవకాశం
- అధికారుల సూచనలు పాటించాలి
- సొంత ప్రయత్నాలు ప్రమాదకరం



ఈతకోటలో విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన కొబ్బరి దింపు కార్మికుడు (ఫైల్)



సంఘటనా ప్రాంతం వద్ద రోదిస్తున్న మృతుని బంధువులు (ఫైల్)



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రావులపాలెం: విద్యుత్‌శక్తి యావత్ మానవాళికీ వెలుగును పంచుతోంది. దాని వెలుగు వెనుక చీకటి కోణాలు సైతం ప్రమాదాల రూపంలో వెంటాడుతున్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం అంచనాలకు మించి ఉంటోంది. ఒత్తిడి నేపథ్యంలో సరఫరాలో సమస్యలు తరచూ తలెత్తుతుంటాయి. గృహ, వ్యాపార, వ్యవసాయ, పశువుల పాకల్లోని విద్యుత్ లైన్ల పట్ల అవగాహనతో మసలుకోకపోతే ప్రాణపాయమయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రాణాలు తోడేస్తున్న ప్రమాదాలు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన లేక కొందరు చేసే తప్పిదాలకు వివిధ వర్గాల ప్రజలు ప్రమాదాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు కొన్ని....

రావులపాలెం ఎంప్లాయీస్ కాలనీలో 2013 జూన్ నెలలో డాబాపై బట్టలు ఆరవేసుకుంటున్న తల్లికి సాయపడేందుకు వచ్చిన పెద్ద కొడుకు తాడేపల్లి కిరణ్‌కుమార్ (23) సర్వీసు వైరు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే 2014 జూలై నెలలో మండలంలోని ఈతకోట గ్రామంలో కొబ్బరి దింపు పనికి వెళ్లి చెట్టు ఎక్కుతున్న గంధ్రోతు వీరన్న(45) విద్యుత్ వైర్లు తగిలి చెట్టుపైనే మృతి చెందాడు. అలాగే 2022 సెప్టెంబర్ రెండో తేదీన సీఆర్‌సీ రోడ్డు వసంత విహార్ అపార్ట్‌మెంట్ వద్ద భవన నిర్మాణ పనికి వచ్చిన పార్వతీపురం జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికులు గుడ్డు వెంకటరమణ (35), గుడబా అర్లప్ప (50) మామాఅల్లుళ్లు విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందారు. గత నెల 21 తేదీన మండలంలోని ఈతకోట గ్రామంలో ఆదే గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చిలకలపూడి రత్నరాజు(23) పని చేస్తున్న భవనం వద్ద విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో కార్మికుడు ఆకుల గణసాయిప్రణమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సొంత ప్రయత్నాలు చేయకూడదు.
- విద్యుత్ వైర్లను తాకుతూ ఎలాంటి వస్తువులను చేర్చకూడదు.
- విద్యుత్ వైర్లను ఇతర వైర్లతో కలపనీయరాదు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- చెట్టు కొమ్మలు వైర్లను కానీ, స్తంభాలను కానీ తాకుతుంటే ముందస్తుగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలి. - తెగిపడిన వైర్లను తాకకుండా జాగ్రత్తపడాలి.
- ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే రక్షించాలన్న ఆతృతతో తాకరాదు. ముందస్తుగా బాధితుడిని తాకిన వైరును తొలగించే చర్యలు చేపట్టాలి.
- తడిచేతులు, తడికాళ్లతో విద్యుత్ ఉపకరణాలను తాకరాదు.

విద్యుత్ కనెక్షన్లు ఇలా...

విభాగం	గృహ కేటగిరి 01	వాణిజ్య కేటగిరి 02	పారిశ్రామిక కేటగిరి 03	సంస్థాగత కేటగిరి 04	వ్యవసాయ కేటగిరి 05	మొత్తం
ఆత్రేయపురం	20629	1426	62	477	2365	24959
ఈతకోట	13682	1211	40	307	760	16000
కొత్తపేట	24033	2759	76	699	1389	28956
రావులపాలెం	17947	3914	78	309	725	22973
అలమూరు	23052	2650	73	455	2137	28367
మొత్తం	99343	11960	329	2247	7376	121255

జాతీయ రహదారి విస్తరణకు కార్యాచరణ

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ పరిధిలోని 216వ నంబర్ జాతీయ రహదారిని వెడల్పు చేసేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. ప్రస్తుతం ఉన్న 18 మీటర్ల రోడ్డును 24 మీటర్లకు వెడల్పు చేసే దిశగా చర్యలు మొదలు పెట్టారు. ఈ నెల 15 లోగా ఖాళీ చేయాలంటూ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కుటుంబాలు, షాపుల యజమానులకు మౌఖికంగా సూచించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. గెద్దాడ, పాశర్లపూడి గ్రామ పరిధిలో కొన్ని అభ్యంతరాల వల్ల ఇంత కాలం బైపాస్ రోడ్డు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. అక్కడ ఉన్న అడ్డంకులను కూడా ఇటీవల క్లియర్ చేశారు. ఈ రెండు చోట్ల బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఇక మిగిలింది పాశర్లపూడి గ్రామ పరిధిలోని ఎన్‌హెచ్‌ను వెడల్పు చేయడమే. దీనిపై కూడా అధికారులు దృష్టి సారించారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో పాటు పాశర్లపూడి ఎన్‌హెచ్‌ను కూడా వెడల్పు చేసే పనులను కూడా ఏకకాలంలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్‌హెచ్ విస్తరణకు పెద్దగా ఇబ్బందులు ఉండవని, నిర్వాసితులకు మూడేళ్ల క్రితమే పరిహారం కూడా చెల్లించామని ఎన్‌హెచ్ ఏఈ వెంకటరమణ సోమవారం తెలిపారు. వారిని వెంటనే స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని తెలియజేశామన్నారు. ఇటీవల 216వ నంబర్ జాతీయ రహదారిపై రద్దీ విపరీతంగా పెరిగింది. దానికి అనుగుణంగా రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పాటు పాశర్లపూడి అమ్మ సూపర్ మార్కెట్ నుంచి కైకాలపేట వరకు విస్తరణ పనులు కూడా పూర్తయితే సమస్యలన్నీ తీరిపోతాయని ఈ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు.

కురిడీ వ్యాపారి ఇంట ప్రాకృతిక స్వాగత ద్వారం



అబ్బురపరుస్తున్న స్వాగత ద్వారం

అంబాజీపేట: పెళ్లి, పేరంటాళ్లు, విందు వినోదాలలో రోజురోజుకు నిర్వాహకులు కొత్తదనాన్ని కోరుకొంటున్నారు. మగ పెళ్లి వారికి ఆడ పెళ్లివారు తమ స్తోమతకు తగినట్లు స్వాగత ద్వారం ఏర్పాట్లు చేస్తూ తమ దర్పాన్ని ప్రదర్శించుకొంటారు. ప్రస్తుతం నిర్వాహకులు పర్యావరణానికి ప్రాధాన్యతనిస్తూ ఏర్పాట్లు నిర్వహిస్తూ అందరి దృష్టిని ఆకర్షించేలా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. సరిగ్గా ఇలాంటి స్వాగత ద్వారాన్ని స్థానిక పెద్ద వీధిలో ఉన్న ప్రముఖ కురిడీ వ్యాపారి అప్పన వారి ఇంటి ఏర్పాటు చేశారు. ప్రముఖ కురిడీ వ్యాపారులు కావటంతో తమ వద్ద ఉన్న కురిడీ కొబ్బరికాయలు, శుభానికి సంకేతమైన చెరుకు గడలు, కోనసీమ గుర్తువచ్చేలా పచ్చి కొబ్బరి చాపలు, కడియం బంతి పూలు, అలంకరణ మొక్కలు, వరి ధాన్యపుకుచ్చులు, తోరణాలతో స్వాగత ద్వారం ప్రాకృతిక వస్తువులతో అబ్బురపరుస్తోంది. అటుగా వెళ్లే వాహన దారులు, పాదచారులు ఆ స్వాగత ద్వారం వైపు ఒక లుక్కేస్తున్నారు.

నేటి నుంచి వైఎస్సార్ క్రికెట్ టోర్నీ

అంబాజీపేట: ముక్కామల బైపాస్ రోడ్డులో మంగళవారం నుంచి జిల్లా స్థాయి వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నీని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభించనున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి సుమారు 40 టీమ్‌లు ఈ టోర్నీలో పాల్గొంటాయన్నారు. టోర్నీలో పాల్గొనే టీమ్ ఎంట్రీ ఫీజు రూ.1.600 చెల్లించాలన్నారు. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు ఇవ్వనున్నామని అన్నారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీ

అలమూరు: స్థానిక సీహెచ్‌సీలో గైనకాలజిస్టుగా కె.స్వర్ణలత నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వైద్యాధికారుల పోస్టుల భర్తీలో భాగంగా ఆమెను నియమిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులను వెలువరించింది. అలాగే జనరల్ మెడిసన్ విభాగంలో వైద్యాధికారిగా కె.సుస్మిత, జనరల్ సర్జన్ విభాగంలో వైద్యాధికారిగా సీహెచ్.ప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. అయితే సీహెచ్‌సీలో ఎనిమిది మంది వైద్యాధికారులు ఉండగా పీడియాట్రిక్ పోస్టు ఖాళీగా ఉందని సూపరింటెండెంట్ పి.గోపిరామ్ తెలిపారు. అమరావతిలో జరుగుతున్న కౌన్సెలింగ్‌లో ఆ పోస్టు కూడా భర్తీ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే చొప్పెల్లలో ఇటీవల పీజీ విద్యను అభ్యసించేందుకు వెళ్లిన ఇద్దరు వైద్యాధికారుల స్థానే ఎన్.లక్ష్మీస్నేహ (డీడీఓ), బి.అనంత రామకృష్ణ నియమితులయ్యారు. పెదపళ్ల పీహెచ్‌సీలో గత ఆరు నెలల నుంచి ఖాళీగా ఉన్న వైద్యాధికారి పోస్టు ఇప్పటి వరకూ భర్తీ కాకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైద్యాధికారిగా పనిచేసిన పి.భవానీశంకర్ ఫారిన్ డిప్యుటేషన్ ట్రాన్స్‌ఫర్ (పీడీటీ)పై బదిలీపై వెళ్లిపోయారని తెలుస్తోంది. డిప్యుటేషన్‌పై వెళితే స్థానిక పీహెచ్‌సీలో పోస్టు భర్తీ కాదని, పీడీటీ విధానంలో వెళితే మరొకరితో ఈ పోస్టును భర్తీ చేయవచ్చనే జిల్లా వైద్యారోగ్యశాఖ చెబుతుంది.

వైభవంగా స్వామివార్ల చక్రస్నానం



ర్యాలి సత్యనారాయణస్వామి ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి క్షేత్రంలో రమా సత్యనారాయణస్వామి, అదే గ్రామంలో వేంచేసిన ఉమా కమండలేశ్వరస్వామి వార్ల చక్రస్నాన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వార్ల కళ్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు రమా సత్యనారాయణస్వామికి పూర్ణాహుతి, అనంతరం చక్రస్నానం, అర్చన, తులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అలాగే ఉమా కమండలేశ్వరస్వామికి ఆ ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణాహుతి, అనంతరం త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీపుష్పోత్సవం అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకన్నకు చక్రస్నానం

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి చక్రస్నానం సోమవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో చక్రస్నానం జరిపారు. అంతకుముందు స్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో కొలువైఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వాహకులు చక్రపెరుమాళ్లు స్వామికి సముద్రం స్నానం చేయించారు. అంతర్వేది బీచ్‌లో అర్చకుల వేద మంత్రాల మధ్య పోతురాజు లక్ష్మీనారాయణ చక్రపెరుమాళ్లు స్వామిని శిరస్సుపై ధరించి సముద్రస్నానం చేయించారు. ఆయనతో పాటు సోదరులు నాగేంద్ర కుమార్, వెంకట కృష్ణలు కూడా పుణ్యస్నానం ఆచరించారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కథల పోటీలు

మలికిపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయ అధికారి బి.నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా మంగళంపల్లి రాధ వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సీహెచ్ సనాశ్రీ కాంక్ష్య, పి.పూజిత, ఎస్ఎస్ శామ్యూల్, సీహెచ్ మహి (ఏఎఫ్‌డీటీ) నిలిచారు. విజేతలకు జూన్ ఆరున జరిగే ముగింపు బహుమతి ప్రదానోత్సవంలో యోగ్యతాపత్రం, బహుమతులు ఇస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు. ఆరో తేదీ లోపు ఇంకా పలు అంశాల్లో పోటీలు ఉంటాయని ఆయన వివరించారు.

నర్సులకు సత్కారం



పి.గన్నవరంలో నర్సులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో పనిచేస్తున్న నర్సులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం తన కార్యాలయంలో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నర్సులు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్ సర్జన్ యు.రాఘవేంద్రరావు, హెడ్ నర్సు అనంతకుమారి, వార నిర్మలకుమారి, గొల్లపల్లి సత్యవతి, గోడి రాజకుమారి, కె.మీనాక్షి, చింతా విజయలక్ష్మి, జాన్ సంతోష్‌రాజ్, సీహెచ్ మణితేజ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



కొత్తపేటలో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు, ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి.శ్రీకర్ ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. 2027లో వచ్చే గోదావరి పుష్కరాలు పురస్కరించుకుని ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ స్థాయిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సోమవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివిజన్‌లో పుష్కరఘాట్‌లు ఎన్ని, కొత్తగా ఏర్పడే ఘాట్‌లు ఎన్ని, ఆయా ఘాట్లలో సౌకర్యాలు, ఘాట్లకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, దేవాలయాలు ఎన్ని, వాటి ఆధునీకరణ తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వ శాఖలు ముఖ్యంగా దేవదాయ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ రానున్న పుష్కరాల ఏర్పాట్లకు సమయం వున్నా గానీ ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో చేసే ఈ పుష్కరాల సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాలను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సత్యానందరావు అధికారులకు సూచించారు. తదుపరి సమావేశం నాటికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెంకట్‌కు కవిరత్న జాతీయ అవార్డు



వెంకట్‌ను సత్కరిస్తున్న కళాకారులు

అంబాజీపేట: మాచవరానికి చెందిన సామాజిక సహజకవి పొలమూరి వెంకట్‌కు కవిరత్న జాతీయ అవార్డు లభించింది. ఈ నెల 10, 11న ఏలూరు మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో కళావేదిక సంస్థ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు, పట్టాభిషేక మహోత్సవాల కార్యక్రమం జరిగిందని వెంకట్ తెలిపారు. వెంకట్ కవితలతో సమాజానికి, సాహిత్య రంగానికి చేస్తున్న సేవలను గుర్తించి కవిరత్న జాతీయ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొల్లి రమావతి, జి.ఈశ్వరి, భూషణం, టి.పార్థసారథి, సర్సిపల్లి హారిక, గజల్ శ్రీనివాస్, బోళ్ల సతీష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



కొత్తపేటలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

కొత్తపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీదారులు సమర్పించే అర్జీని అధికారులు తమ సొంత సమస్యగా భావించి పరిష్కరించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) టి.నిషాంతి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ప్రజలకు, పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు వికేంద్రీకరించినట్లు తెలిపారు. అర్జీదారులు ఏ స్థాయి సమస్యలను ఆ స్థాయిలోని అధికారులకు నివేదించి పరిష్కారానికి తగు మార్గాలు కోరాలన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, తదితర అధికారులు అర్జీల పరిష్కారంలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. అప్పుడే అర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటు సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. కింది స్థాయిలో పరిష్కారానికి వీలులేని వాటిని సరైన విధంగా పై స్థాయికి పంపాల్సి ఉంటుందన్నారు. అర్జీదారులు టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి సమస్యను నమోదు చేయవచ్చని అదే విధంగా మీకోసం వెబ్‌సైట్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీవో పీఎస్ నరేష్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు అంకిత భావంతో పనిచేయాలి

కొత్తపేట: వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాధిత మహిళలకు ఒకే గొడుగు కింద సహాయం అందించేందుకు ఉద్దేశించిన పథకమని ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడంలో నూతనంగా ఎంపికైన ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నందు నూతనంగా నియమించబడిన వన్ స్టాప్ సెంటర్ కాంట్రాక్టు ఉద్యోగులకు నియమాక ఉత్తర్వులు జేసీ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఈ కేంద్రం మహిళా మరియు శిశు అభివృద్ధి కేంద్ర మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పనిచేస్తుందన్నారు. మహిళలకు అనేక రకాల సేవలను ఒకే చోట అందిస్తారని వైద్య సహాయం, బాధ్యత మహిళలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో సహాయం, మానసిక-సాంఘిక మద్దతు, కౌన్సెలింగ్ వంటి సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి సీడీపీవోలు, వన్ స్టాప్ కేంద్రం నూతన సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త చంద్రశేఖర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్

రాజోలు: మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ జాతీయ స్మారక అవార్డును పొన్నమండ గ్రామానికి చెందిన మాజీ సామాజిక కార్యకర్త గంటి చంద్రశేకర్ అందుకున్నారు. ఈ నెల 11న విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పలువురికి అవార్డులు అందజేశారు. శాసనమండలి మాజీ స్పీకర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ఎంఏ షరీఫ్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్న చంద్రశేఖర్‌కు బంగారు పతకంతో పాటు జ్ఞాపికతో సత్కరించారు.

సారా కేసులో 11 మంది బైండోవర్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం రాజవరంలో సారా కేసులకు సంబంధించి 11 మంది వ్యక్తులకు తహసీల్దార్ పి.రాజేశ్వరరావు ఎదుట బైండోవర్ చేసినట్టు కొత్తపేట ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజవరం గ్రామాన్ని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సారా రహిత గ్రామంగా ప్రకటించామన్నారు. సారా తయారీ, విక్రయం, రవాణా జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 14405, సీఐ సెల్ నంబర్ 9440902423, ఎస్సై సెల్ నంబర్ 9494187178కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా ఇటికాలమ్మ తీర్థం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకొని చలివిడి పానకం, ముడుపులు, మొక్కులను తీర్చుకొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంధ్రోతు శ్రీనివాసరావు, కామిశెట్టి పండు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన జాతరలో గరగ నృత్యం, వీరనాట్యం, శక్తివేషాల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఊడిమూడి మాజీ సర్పంచ్ మృతి

పి.గన్నవరం: ఊడిమూడి మాజీ సర్పంచ్ అడ్డాల వీరరాఘవ (56) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె 2001 నుంచి 2005 వరకూ ఊడిమూడి గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారు. కొద్ది రోజుల క్రితం ఆమె అనారోగ్యానికి గురవడంతో, ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె భర్త, ఊడిమూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు అడ్డాల రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సోమవారం పలువురు పరామర్శించారు.

రోడ్ల నాణ్యత పరిశీలన

పి.గన్నవరం: ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి రాష్ట్రంలో అక్కడక్కడా చిన్న చిన్న లోపాలను గుర్తించి రూ.2 కోట్ల మేర రికవరీ చేసినట్టు ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ జి.వెంకటేశ్వర రావు చెప్పారు. రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన అంబాజీపేట-పి.గన్నవరం రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పోతవరం వద్ద 360 మీటర్ల మేర రోడ్డు డ్రెయిన్‌లోకి కుంగిపోతున్న నేపథ్యంలో అక్కడ మీటరన్నర లోతున మట్టిని తొలగించి, లైమ్ స్టెబిలైజేషన్ పద్ధతిలో పటిష్ట పరచి రోడ్డు నిర్మించారు. ఈ పనులను సీఈ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు నాణ్యతను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, డీఈ పి.హరి ప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈఈ జి.రాజేంద్ర ప్రసాద్, జేఈలు త్రినాథరావు, భవాని, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.